గురువుల పట్ల గౌరవం తప్పనిసరి : సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గురువుల పట్ల గౌరవం తప్పనిసరిగా ఉండాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. రామదూత స్వామి ఆధ్వర్యాన మంగళగిరి సికె కన్వెన్షన్‌లో ఆదివారం జరిగిన గురుపూర్ణిమ ఉత్సవంలో సిఎం పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. సత్యం, ధర్మం, ధ్యానం ద్వారా సమున్నత జీవన గమ్యం ఏర్పరచుకోవాలన్న వేదవ్యాసుడి ఉపదేశాన్ని అనుసరిస్తూ గురువుల పట్ల అత్యంత గౌరవంతో మెలగాలన్నారు. ప్రజలంతా మహోన్నత ఆశయాలతో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తున్నట్లు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు.

త్వరితగతిన విద్యుత్ సరఫరా పునరుద్ధరణ : విజయానంద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వర్ష ప్రభావిత ప్రాంతాల్లో వీలైనంత త్వరగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని అధికారులను ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ ఆదేశించారు. రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు, వరదల నేపథ్యంలో విద్యుత్ సంస్థల అధికారులతో ఆదివారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఎలాంటి అత్యవసర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే 1912 నెంబర్‌ను సంప్రదించాలని ప్రజలను కోరారు. ఇపిడిసిఎల్ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, ఉభయ గోదావరి సర్కిళ్లు, ఎస్‌పిడిసిఎల్ పరిధిలోని కర్నూలు, కడప, సిపిడిసిఎల్ పరిధిలోని సిఆర్‌డిఎ సర్కిళ్లు దెబ్బతిన్నాయని గుర్తించారు. ఎపిఇపిడిసిఎల్ పరిధిలోని రాజమండ్రి, ఏలూరు సర్కిళ్లలో ప్రధానంగా నష్టం వాటిల్లిందని ఆ డిస్కం సిఎండి ఐ పృథ్వితేజ్ అన్నారు. కుకునూరు, వేలేరుపాడు, రాజీవ్‌నగరంలోని 33/11కెవి సబ్‌స్టేషన్లు దెబ్బతిన్నాయని తెలిపారు. సుమారు రూ.193.89 లక్షలు నష్టం వాటిల్లిందని అంచనా వేస్తున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో జెన్‌కో ఎండి కెవిఎన్ చక్రధర్‌బాబు, ట్రాన్స్‌కో గ్రిడ్ డైరెక్టరు ఎవికె భాస్కర్, ఎస్‌పిడిసిఎల్ కె సంతోషరావు తదితరులు పాల్గొన్నారు.

వరద నేపథ్యంలో పంటు రాకపోకలు నిలిపివేత

ప్రజాశక్తి-నరసాపురం (పశ్చిమగోదావరి జిల్లా)

నరసాపురం మండలం మాధవవాయిపాలెం - కోనసీమ జిల్లా సఖినేటిపల్లి రేవులో ఇరు జిల్లాల మధ్య తిరిగే పంటు రాకపోకలు ఆదివారం మధ్యాహ్నం నుండి అధికారులు నిలిపివేశారు. ముందస్తు జాగ్రత్తలో భాగంగా జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు పంటును నిలిపివేసినట్లు నరసాపురం ఇన్‌ఛార్జి ఎంపిడిఒ కె వీరభద్రరావు తెలిపారు. గోదావరిలో వరద తాకిడి తగ్గిన తర్వాత తిరిగి రాకపోకలను ప్రారంభిస్తామని పేర్కొన్నారు. నరసాపురం నుంచి అంబేద్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి లంక గ్రామాల ప్రజలు నరసాపురం వచ్చేందుకు, నరసాపురం నుంచి సఖినేటిపల్లి వైపు రాకపోకలు నిలిచిపోయాయి. ప్రయాణికులు తిరిగి చించినాడ బ్రిడ్జి నుండి కోనసీమ జిల్లాకు వెళ్తున్నారు.

ఉద్యోగాలు ఉత్తమాటే

(మొదటి పేజీ తరువాయి)

భూములిచ్చారు. 2011 కృష్ణపట్నంలో ప్రభుత్వ భూమి సర్వే నెం 455, 459లో 590 ఎకరాలిచ్చారు. అదే గ్రామంలో సర్వే 440, 755 వరకు 46 ఎకరాలు, 2011లో ఈపూరులో ప్రభుత్వ భూమి సర్వే 532 లో 66 ఎకరాలు, ముత్తుకూరులో పట్టా భూమి 2011లో సర్వే 532, 533, 539లో 103 ఎకరాలు, తమ్మిన పట్నంలో పట్టా భూమి సర్వే 780,781లో 107 ఎకరాలు, 2010లో కృష్ణపట్నంలో ప్రభుత్వ భూమి సర్వే 416, 699, 711, 756లో సుమారు 1000 ఎకరాలు, మరోచోట సర్వేనెం 374, 381, 383లో మరో 139 ఎకరాలు తీసుకున్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని అప్పటి పోర్టు యాజమాన్యం చెప్పడంతో ఈ భూములను అప్పటి ప్రభుత్వం అప్పగించింది. ఎకరా భూమిని కేవలం రూ.64 వేలకు కూడా పోర్టుకు కేటాయించారు.

అదాని చేజిక్కించుకున్న తరువాత...

2020లో ఈ పోర్టుకు అదాని తీసుకున్నారు. ఆ తరువాత ఇక్కడ ఉన్న కంటైనర్ టెర్మినల్‌ను ఇక్కడి నుండి తరలించారు. దీనికోసం ఉపయోగించిన వందలాది ఎకరాల భూమి ప్రస్తుతం ఖాళీగా ఉంది. కంటైనర్ టెర్మినల్‌కు అనుబంధంగా వచ్చిన అనేక పరిశ్రమలు కూడా మూతపడ్డాయి. దీంతో కొత్త ఉద్యోగాలు వచ్చే సంగతి ఎలా ఉన్నప్పటికీ, ఇప్పటికే ఉన్న వేలాది ఉద్యోగాలు ఊడాయి. టెర్మినల్ కోసం నిర్మించిన మిద్రియార్డ్, గోదాములు, వివిధ రకాల భవనాలు నిరుపయోగంగా మారాయి. ఒకప్పుడు అనేక రకాల ఉత్పత్తులను ఎగుమతి, దిగుమతులు చేసిన కృష్ణపట్నం పోర్టు ప్రస్తుతం బొగ్గు, ఇసుప ఖనిజాలకు మాత్రమే పరిమితమైంది. వివిధ అవసరాలకోసం కేటాయించిన వేలాది ఎకరాల భూమి నిరుపయోగంగా మారింది. దీంతో, భూములను అభివృద్ధి చేసి స్థానిక యువతకు ఉపాధి కల్పించాలని, లేని పక్షంలో రైతులకు స్వాధీనం చేయాలన్న డిమాండ్ ముందుకు వస్తోంది. ఇటీవల స్థానిక ఎంఎల్ఎ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఇదే విషయాన్ని పోర్టు యాజమాన్యాన్ని ప్రశ్నిస్తే వారు సమాధానం ఇవ్వలేక నీళ్లు నమిలారు. ప్రస్తుతం భూములను కాపాడుకునే పనిలో అదాని గ్రూపు యాజమాన్యం ఉన్నట్లు సమాచారం.

ధైర్యంగా ఉండండి.. అండగా ఉంటాం..

- పెదవాగు ప్రాజెక్టు వరద ముంపు బాధితులకు సిపిఎం బృందం భరోసా
- వేలేరుపాడు మండలంలో దెబ్బతిన్న గ్రామాల్లో పర్యటన
- పంటలు, ఇళ్లు కోల్పోయి రోడ్డున పడ్డామంటూ బాధితుల ఆవేదన
- తక్షణ సాయంగా రూ.పదివేలు ఇవ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'ధైర్యంగా ఉండండి.. అండగా ఉంటాం..ప్రభుత్వం ఆదుకునే వరకూ అన్ని రకాల ఒత్తిళ్లూ తీసుకొస్తాం' అని సిపిఎం నేతలు వరద బాధిత కుటుంబాలకు భరోసా ఇచ్చారు. పెద్దవాగు ప్రాజెక్టుకు గండిపడి తీవ్రంగా నష్టపోయిన వేలేరుపాడు మండలంలోని గ్రామాల్లో సిపిఎం బృందం ఆదివారం పర్యటించింది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, రాష్ట్ర నాయకులు ఎం.హరిబాబు ఆధ్వర్యంలో రాష్ట్ర, జిల్లా నాయకుల బృందం వేలేరుపాడు మండలంలోని అల్లూరి నగర్, కోయమాధవరం, మద్దిగట్ల గ్రామాల్లో పర్యటించి బాధితులను కలిసి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాధితులు కొంజె సుజాత, ముత్యాల సీత, సరెద్దుల రత్తమ్మ, రామ్మూర్తి మాట్లాడుతూ.. ప్రాజెక్టుకు గండిపడటంతో రాత్రికి రాత్రే ఊళ్లన్నీ జలమయమయ్యాయని వాపోయారు. ఇళ్లు, ఇంట్లో సామాన్లు కొట్టుకుపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. వరి, పత్తి, మిరప పంటల కోసం వేసిన నారుమడులు పూర్తిగా ధ్వంసమయ్యాయని, పొలాల్లో పెద్దఎత్తున ఇసుక మేటలు వేయడంతో ఇప్పట్లో భూములు పంటకు పనికిరాకుండా పోయిన పరిస్థితి నెలకొందని తెలిపారు. అల్లూరినగర్‌లో 85 ఇళ్లకుగాను 45 ఇళ్లు కొట్టుకుపోయాయన్నారు. పునరావాస కేంద్రం దూరంగా ఉండడంతో అక్కడకు

పెదవాగు ప్రాజెక్టు సర్వంకోల్పోయిన అల్లూరి నగర్ వాసులతో మాట్లాడుతున్న సిపిఎం బృందం

వెళ్లలేక దెబ్బతిన్న ఇళ్లలోనే తలదాచుకుంటున్నామని తెలిపారు. కోయమాధవరం, మద్దిగట్ల గ్రామంలో బాధితులూ తమ గోడు వెళ్లబోసుకున్నారు. జోరువానలోనూ బృందం పర్యటన కొనసాగింది. ఈ సందర్భంగా సీతారాం స్పందిస్తూ బాధితులకు న్యాయం జరిగే వరకూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

మహా విపత్తుకు గత ప్రభుత్వాల తప్పిదమే కారణం : మంతెన సీతారామ్

జంగారెడ్డిగూడెంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడుతూ.. వేలేరుపాడు మండలంలోని 15 గ్రామాల్లో మహా విపత్తు సంభవించిందన్నారు. ముమ్మాటికీ గత ప్రభుత్వాల తప్పిదాల కారణంగానే ప్రాజెక్టుకు గండిపడిందని తెలిపారు. ప్రాజెక్టు తెలంగాణ ప్రాంతంలో ఉన్నప్పటికీ సాగు భూములు అత్యధికంగా ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలంలో ఉన్నాయన్నారు. ఈ ప్రాజెక్టు కింద 16 వేల ఎకరాలు సాగు భూమి ఉండగా 13,463 ఎకరాలు మన రాష్ట్రంలో, 2,360 ఎకరాలు తెలంగాణలో ఉన్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టు మెయింటెనెన్స్‌కు మన రాష్ట్రం 85 శాతం, తెలంగాణ 15 శాతం భరించాల్సి ఉందన్నారు. గత ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఇప్పుడు ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. దాదాపు రెండు వేల కుటుంబాలు తీవ్రంగా నష్టపోయాయన్నారు. గండిపడిన సమయంలో గోదావరికి వరద లేదని, లేకుంటే తీవ్ర ప్రాణ నష్టం జరిగేదని తెలిపారు. యుద్ధప్రాతిపదికన ప్రాజెక్టును పున:నిర్మించాలని కోరారు. పునరావాస శిబిరాలు కొనసాగించడంతోపాటు, టార్పాలిన్లు, నిత్యావసర వస్తువులు, పాత్రలు, బట్టలు, గ్యాస్ సిలిండర్లు అందించాలని, ప్రతి కుటుంబానికీ తక్షణ సాయం కింద రూ.పదివేలు అందించి, వెంటనే నష్టం అంచనాలు తేల్చి పరిహారం ఇవ్వాలని కోరారు. ఇళ్లు కోల్పోయిన ప్రతి కుటుంబానికీ పక్కా ఇళ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. సిపిఎం రాష్ట్ర నాయకులు ఎం.హరిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే జనానికి అండగా ఉండే చర్యలు చేపట్టాలన్నారు. సిపిఎం జిల్లా నాయకులు డిఎన్‌విడి ప్రసాద్, తెల్లం రామకృష్ణ, తెల్లం దుర్గారావు, మొడియం నాగమణి, మడివి దుర్గారావు, ధర్ముల రమేష్, యర్రంశెట్టి నాగేంద్రరరావు ఇతర నాయకులు పాల్గొన్నారు.

.వరద బాధితులతో మాట్లాడుతున్న రామకృష్ణ

ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపించాలి

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

ప్రజాశక్తి - వేలేరుపాడు (ఏలూరు జిల్లా)

వరద బాధితులకు ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలంలోని అల్లూరి నగర్, మేడేపల్లి, మాదారం, ఉదయ్ నగర్ తదితర గ్రామాల్లో వరద బాధితులను సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగ ప్రభాకర్, ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ యామిని, స్థానిక నాయకులతో కలిసి ఆయన ఆదివారం పరామర్శించారు.ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. తెలంగాణలోని పెదవాగు ప్రాజెక్టు వరదతో మన రాష్ట్రంలోని సుమారు 20 గ్రామాలు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. అనేక చోట్ల రహదారులు తెగిపోవడం, విద్యుత్ స్తంభాలు పడిపోవడం వలన బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయి దుర్భరమైన జీవనం సాగించారన్నారు. గత పాలకులు సరైన క్రమంలో ప్రాజెక్టుల మరమ్మతులు చేపట్టినట్టయితే ఇంతటి నష్టం జరిగేది కాదన్నారు. భారీ వర్షాలకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం మేడేపల్లి ప్రాంతంలో పునరావాస కేంద్రాన్ని సందర్శించి వారికి కల్పించిన సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. రుద్రంకోట వద్ద వద్ద వరద ఉధృతిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కారం దారయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు సన్నేపల్లి సాయిబాబు పాల్గొన్నారు.

రాష్ట్ర హక్కుల కోసం నిలబడాలి

(మొదటి పేజీ తరువాయి)

గొడవలు ఉంటే అసెంబ్లీలో చర్చించాలని సూచించారు. జగన్ అందుకు భిన్నంగా ఢిల్లీలో ధర్నా అంటున్నారన్నారు. రాష్ట్ర హక్కులపై ఢిల్లీలో ధర్నా చేస్తే మేలు జరుగుతుందని సూచించారు. అసెంబ్లీ సమావేశాల్లోనూ అన్ని రకాల సమస్యలపై చర్చించి వాటికి పరిష్కారాలు లభించేలా చూడాలని కోరారు. ప్రజలు చాలా ఆకాంక్షలతో ఉన్నారన్నారు. గత నాలుగేళ్లలో ఇరిగేషన్ ప్రాజెక్టులకు రూ.61,500 కేటాయిస్తే రూ.32 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారన్నారు. గత పదేళ్లలో సాగునీటి ప్రాజెక్టులపై పాలకులకు చిత్తశుద్ధి కొరవడిందని తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లాలోని జంఝావతి ప్రాజెక్టుపై కేవలం 150 మీటర్ల స్థల వివాదం వల్ల 3.5 టిఎంసిల నీటిని రైతులు వాడుకోకుండా వదిలేయాల్సి వచ్చిందన్నారు. రాష్ట్రంలో 90 శాతం పూర్తయిన ప్రాజెక్టులకు కొద్దిపాటి నిధులు కేటాయిస్తే రైతులకు పూర్తిగా వినియోగంలోకి వస్తాయని తెలిపారు. ఇలాంటివి 10 నుంచి 15 వరకూ ఉన్నాయని వివరించారు. వెలిగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు పునరావాసం ఇవ్వకుండానే ప్రాజెక్టును గత అక్టోబరులో జగన్ ప్రారంభించారన్నారు. కాలువలూ పూర్తి కాలేదని తెలిపారు. దీనివల్ల ఎవరికీ ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. అదిగోఇదిగో ప్రారంభం అంటూ ముహూర్తాలతోనే కాలయాపన చేశారని తెలిపారు. నిర్వహణకు కూడా నిధులు ఇవ్వనందున ప్రాజెక్టులు అధ్వానంగా మారాయన్నారు. వెనుకబడిన ప్రకాశం వంటి జిల్లాలకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీలు ఇవ్వాలని, ప్రకాశం జిల్లాకు రూ.10 వేల కోట్లు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్‌కె.మాబు, కంకణాల ఆంజనేయులు పాల్గొన్నారు.

నూతన క్రిమినల్ చట్టాలు హానికరం

- యుటిఎఫ్ రాష్ట్ర సదస్సులో రమేష్ బాబు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన క్రిమినల్ చట్టాలు సమాజానికి హానికరమైనవని ఐలు జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎస్.రమేష్ బాబు అన్నారు. 'నూతన క్రిమినల్ చట్టాలు - పర్యవసానం', 'ప్రత్యామ్నాయ విద్యా విధానం' అనే అంశాలపై యుటిఎఫ్ ఆధ్వర్యాన ఆదివారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర స్థాయి సదస్సులు జరిగాయి. ఈ సందర్భంగా నూతన క్రిమినల్ చట్టాలపై రమేష్ బాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన క్రిమినల్ చట్టాలు ప్రజలకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తాయని తెలిపారు. ప్రజాస్వామ్య హక్కులకు భంగకరమైనవని పేర్కొన్నారు. ఐపిసి చట్టాలను భారత సంహిత పేరుతో అమలు చేయడాన్ని గర్హిస్తున్నామని, ప్రభుత్వం చేసే ఏ చట్టాలైనా ప్రజల హక్కులను పరిరక్షించేవిగా ఉండాలేగానీ.. హక్కులను ఖనన చేసేవిగా ఉండరాదన్నారు. జ్యుడీషియల్ వ్యవస్థను తగ్గించి పోలీసులకు ప్రత్యేక అధికారాలను కట్టబెట్టేవిగా, ప్రజా ఉద్యమాలను అణచివేసేవిగా నూతన క్రిమినల్ చట్టాలు ఉన్నాయని వివరించారు. ఆ చట్టాలను నియంతృత్వంగా అమలు చేయడా న్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవిఎస్.ప్రసాద్ ప్రత్యామ్నాయ విద్యా విధానంపై మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగం క్షీణ దశకు చేరుకుంటోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలలు ఒకే రకమైన సిలబస్‌ను, ఒకే రకమైన పరీక్ష విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. తెలుగు, ఇంగ్లీష్ రెండు బోధనా మాధ్యమాలను ఉన్నత పాఠశాలల్లో కొనసాగించాలని కోరారు. మినిమం టైమ్ స్కేల్ ఉపాధ్యాయులను రెగ్యులర్ చేయాలని, జిపిఎస్ విధానాన్ని రద్దు చేసి ఒపిఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సుల్లో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు రెడ్డి మోహనరావు, ఎస్.కిషోర్ కుమార్, పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బీడీ కార్మిక సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ జి ఓబులు

బీడీ కార్మికుల సంక్షేమబోర్డు పునరుద్ధరణ

- నిధులు కేటాయించాలి
- ప్రభుత్వానికి సమన్వయ కమిటీ విజ్ఞప్తి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

బీడీ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరణ చేసి సంక్షేమానికి నిధులు కేటాయించాలని బీడీ కార్మికుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ జి ఓబులు ప్రభుత్వాన్ని కోరారు. కర్నూలు జిల్లా కార్మిక కర్షక భవన్‌లో ఆదివారం బీడీ కార్మిక సంఘం రాష్ట్ర కో కన్వీనర్ ఎస్ ఇక్బాల్ హుస్సేన్ అధ్యక్షతన బీడీ కార్మికుల రాష్ట్ర సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి ఓబులు మాట్లాడుతూ రాష్ట్రంలో బీడీ కార్మికులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల ఫలితంగా కార్మికులు అనేక హక్కులను కోల్పోవాల్సి వస్తుందని తెలిపారు. కార్మికుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించకుండా అన్యాయం చేస్తున్నాయన్నారు. జిఎస్‌టి పేరుతో బీడీ కార్మాగాలపై భారం వేయడం వల్ల ఆయా యజమానులు కార్మికులకు ఇవ్వాల్సిన వేతనాలు ఇఎస్ఐ, పిఎఫ్ వంటి సౌకర్యాలను కల్పించలేకపోతున్నారని తెలిపారు. కార్మికులకు ఉచిత వైద్య సదుపాయం పేరుతో జిల్లాలో పెట్టిన ఆస్పత్రిలో వైద్యులు, మందులు అందుబాటులో ఉండడం లేదన్నారు. కార్మికులు పనిచేసే ప్రదేశాలలో వైద్య సేవలు అందే విధంగా మెడికల్ మొబైల్ వ్యాన్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీడీ తయారీ చేయడం వల్ల కార్మికులకు టిబి, క్షయ, కేన్సర్ వంటి అనేక వ్యాధులకు గురికావలసి వస్తోందని, కొంత మంది చనిపోయిన సందర్భాలూ ఉన్నాయని అన్నారు. బీడీ కార్మికులకు ఉచిత వైద్య సదుపాయం, ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం, స్కాలర్ షిప్‌లు, యజమానుల ద్వారా గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. తెలంగాణా మాదిరిగా నెలకు రూ. మూడు వేల పింఛన్లు ఇవ్వాలని, ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీడీ కార్మికుల సమన్వయ కమిటీ కోకన్వీనర్‌గా ఉన్న చైతన్య స్థానంలో కర్నూలు నుండి ఎస్ ఎక్బాల్ హుస్సేన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సిఐటియు కర్నూలు జిల్లా కార్యదర్శి ఎండి అంజిబాబు, షబ్బీర్, షంశాద్, శ్రీనివాస్‌రెడ్డి, సత్యసాయి, జగన్‌మోహన్, బాబుఖాన్, రసూల్‌ఖాతూన్, కమ్రూన్, రబియాబీ తదితరులు హాజరయ్యారు.

దాడులపై కేంద్ర సంస్థలతో విచారణ

- గవర్నర్‌కు వైఎస్ జగన్ వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం దాడులపై కేంద్ర సంస్థలతో విచారణ జరిపించాలని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాజ్‌భవన్‌లో ఆదివారం సాయంత్రం గవర్నరుతో భేటీ అయ్యారు. వీరి మధ్య భేటీ సుమారు అరగంటకు పైగా సాగింది. ఈ సందర్భంగా గవర్నరుకు జగన్ పలు అంశాలపై వివరించారు. ఇందుకు సంబంధించి వినతిపత్రాన్ని అందజేశారు. యథేచ్ఛగా హత్యలు, దాడులు, ఆస్తుల విధ్వంసం కొనసాగుతోందని, తమ పార్టీని అణగదొక్కడమే ప్రభుత్వ లక్ష్యంగా కనబడుతోందని జగన్ పేర్కొన్నారు. కూటమి పాలనలో 36 మంది హత్యకు గురయ్యారని, 300 మందికిపైగా హత్యాయత్నాలు, టిడిపి వేధింపులు భరించలేక మరో 35 మంది ఆత్మహత్య చేసుకున్నారన్నారు. 1050కు పైగా దౌర్జన్యాలు, దాడులు, 2,700 కుటుంబాలు ఊళ్లు విడిచి వెళ్లిపోయాయని అన్నారు. వినుకొండలో తమ పార్టీ కార్యకర్త రషీద్‌ను దారుణంగా హత్య చేశారని, ఆ ఘటన రాష్ట్ర ప్రజానీకాన్ని తీవ్ర కలవరపాటుకు గురిచేసిందని అన్నారు. చిత్తూరు జిల్లా పుంగనూరులో మాజీ ఎంపి రెడ్డప్పను పరామర్శించడానికి వెళ్లిన ఎంపి మిథున్‌రెడ్డిపై టిడిపి మూకలు రాళ్లదాడి చేశాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోందని, సంఘ విద్రోహ శక్తులు పెట్రేగిపోతున్నాయని వివరించారు. సుమారు 27 మంది ఐఎఎస్, 24 మంది ఐపిఎస్‌లకు పోస్టింగులు ఇవ్వకుండా చేశారంటే చంద్రబాబు లక్ష్యాలు, ఉద్దేశాలు కళ్లముందే కనిపిస్తున్నాయన్నారు.

జగన్‌వి తప్పుడు ఆరోపణలు : హోంమంత్రి అనిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పరామర్శ పేరుతో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని హోంమంత్రి వంగలపూడి అనిత ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ హత్యలు, హత్యాయత్నాలపై అబద్ధాలు చెబుతున్నారని, వీటికి సంబంధించిన వివరాలను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేదంటే తప్పుడు ఆరోపణల నేపథ్యంలో జగన్‌పై చర్యలు తీసుకుంటామన్నారు. టిడిపి కార్యాలయంలో ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రజల్లో విషపు బీజాలు నాటడానికి జగన్ ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ప్రజల్లో భయాన్ని సృష్టించేందుకు కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వచ్చిన తరువాత జరిగిన నాలుగు రాజకీయ హత్యల్లో ముగ్గురు టిడిపి నాయకులే చనిపోయారని వివరించారు. ఐదేళ్ల వైసిపి పాలనలో జరిగిన ఘోరాలపై జగన్ ఏనాడూ మాట్లాడలేదన్నారు. అసెంబ్లీకి వస్తే తన బండారం బయటపడుతుందనే ఢిల్లీలో ధర్నా అంటూ జగన్ నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. చిన్నపిల్లలపై అఘాయిత్యాలు గంజాయి, మద్యం మత్తులోనే ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. వీటిని అరికట్టడానికి ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఎస్‌పితోపాటు తాను కూడా బడిపిల్లలతోపాటు ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. అత్యాచారాలపై టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుచేసి ఘటనలను పూర్తిగా అరికడతామన్నారు.

ముచ్చుమర్రి లాకప్‌డెత్‌పై న్యాయ విచారణ

- కెవిపిఎస్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నంద్యాల జిల్లా ముచ్చుమర్రిలోని బాలికపై అత్యాచారం చేసి చంపి కాలువలో పడేసిన కేసులో నిందితుడైన యోహాన్ లాకప్‌డెత్‌పై న్యాయ విచారణ జరిపించాలని కెవిపిఎస్ డిమాండ్ చేసింది. ఈ మేరకు హోంమంత్రి, ఎస్సి కమిషన్ ఛైర్మన్‌కు కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి ఆదివారం వినతిపత్రం అందజేశారు. అత్యాచారం కేసులో యోహాన్‌ను పోలీసులు విచారణ పేరుతో నందికొట్కూరు నుంచి మిడుతూరుకు అక్కడ నుంచి నంద్యాల సిసిఎస్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి హింసించడం వల్లే మృతిచెందినట్లు అతని శరీరంపై వున్న గాయాలను బట్టి అర్థమవుతోందని అన్నారు. నిందితుడు జీపు నుంచి దూకి పరిగెత్తడం వల్లే హార్ట్ ఫెయిల్యూర్ అయిందని పోలీసులు చెబుతున్న మాటలు నమ్మశక్యంగా లేవన్నారు. మృతుడిని బంధువులకు అప్పగించకుండా, మీడియాకు కూడా చూపకుండా ఇతరులను అనుమతించకుండా రహస్యంగా అంత్యక్రియలు ఎందుకు జరిపారని ప్రశ్నించారు. ముచ్చుమర్రి ఘటన తీవ్రమైందేనని, అయితే పోలీసులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా రాజ్యాంగబద్ధంగా విచారణ చేయాల్సిందని అన్నారు. దళితుడైన యోహాన్‌పై పోలీసులు చేసిన ఈ దారుణంపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

ICICI Home Finance
కార్పొరేట్ కార్యాలయం: ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ ఐసిఐసిఐ హెచ్‌ఫిసి టవర్, అందేరి -కుర్లా రోడ్, అందేరి (తూర్పు), ముంబాయి-400059, ఇండియా
శాఖ కార్యాలయం: డో.నం.13-1-54, 1ఎ అంతస్తు, దా.ఎన్.వి.రమేష్ కాంప్లెక్స్, రామయ్య వీధి, మెయిన్ రోడ్డు, కాకినాడ-533001.
[రూల్ 8(6)కు నిబంధన చూపుట]
స్థిరాస్తుల విక్రయం కొరకు నోటీసు
సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6)కు నిబంధనతో చదువుతూ సెక్యురిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 క్